కొండపైకి వెళ్లాలంటే నరకమే!

- ప్రమాదభరితంగా కొండ ప్రాంత మెట్ల మార్గాలు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న నివాసితులు
- సమస్యలు పరిష్కరించాలని వినతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తపేట ప్రాంతాల్లో కొండపైకి వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. కొత్తపేట కొండ ప్రాంతాల్లో నివాసిస్తున్న నివాసితులు రాకపోకలు సాగించేందుకు నానా తంటాలు పడుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు పది డివిజన్లలో కొండ ప్రాంత పరిధిలో కొనసాగుతున్నాయి. అందులో వేలాది మంది కుటుంబాలు నివాసిస్తున్నాయి. వారిలో పేద, మధ్య తరగతి కుటుంబాలే అధిక శాతం నివాసిస్తున్నారు. వారందరూ మెట్ల మార్గాల్లో ప్రయాణం చేసేందుకు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. పేదలం కావటం వలనే తమ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగా దెబ్బతిన్న మెట్ల మార్గాలు....

నియోజకవర్గంలోని కొత్తపేట, మల్లికార్జునపేట తదితర ప్రాంతాల్లోని మెట్ల మార్గాలు చాలా వరకూ పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానిక నివాసితులైన వృద్ధులు, చిన్నారులు, మహిళలు రాకపోకలు సాగించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, ఇతర అనారోగ్య బాధితులు ఆసుపత్రులకు కొండ ప్రాంత మెట్ల మార్గాల్లో వెళ్లాలంటే వారి పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనిపై ఎన్ని మార్లు మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపేట కొండ ప్రాంతాల్లో దెబ్బతిన్న మెట్ల మార్గం

ఏడాదిగా పట్టించుకోని వైనం...

కొండ ప్రాంతాల్లోని మల్లికార్జునపేట తదితర ప్రాంతాల్లో కనీసం ఏడాదిగా అధికారులెవరూ మెట్ల మార్గాలపై దృష్టి పెట్టలేదని స్థానిక నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఆ దిశగా ఎటువంటి స్పందన లేకుండా ఉండటంపై స్థానిక ప్రజలు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. అలాగే చెత్తను తరలించే నగరపాలకసంస్థ సిబ్బంది సైతం విధి నిర్వహణకు నానా తంటాలు పడుతున్నారు. దాంతో చెత్త తరలింపుపై వారంతా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదంటూ స్థానికులు వివరిస్తున్నారు.

మెట్ల మార్గాలను నిర్మించాలి



కొత్తపేట తదితర ప్రాంతాల్లో మెట్ల మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొండ ప్రాంతాల్లో ఉండే ప్రజలు రాకపోకలు సాగించాలంటే అనేక అవస్థలు పడుతున్నారు. వీటిపై ఎన్నిమార్లు చెప్పినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించటం లేదు. ఆందో ళనలు చేసినా పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెట్ల మార్గాలను నిర్మాణం చేయాలి.

కె.సూరిబాబు, కొండ ప్రాంత నివాసితుడు

క్లుప్తంగా

నేరప్రవృత్తిని వదిలేయండి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నేర ప్రవృత్తిని వీడి మంచి నడవడికతో, సత్ ప్రవర్తనతో మెలిగిన వారిపై షీట్లు తొలగిస్తామని కొత్తపేట సీఐ చిన్న కొండలరావు తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ కొండలరావు మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఆదివారం స్టేషన్‌కు వచ్చి కనబడి వెళ్లుతున్నాం.. మిగిలిన రోజుల్లో ఏం చేసినా చెల్లుతుందనే భావన వద్దన్నారు. గంజాయి , ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే సమాచారం ఉందన్నారు. అటువంటి వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదే విధంగా ఎవరైనా ఎక్కడైన గొడవలకు దిగినా, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిని ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హోప్ ఫర్ స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది పేద విద్యార్థులకు పుస్తకాలు, అకాడమిక్ కిట్స్ పంపిణీ చేశారు. చిట్టినగర్ సొరంగంరోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్ విచ్చేశారు. 12 ఏళ్ల కిందట కొంత మంది స్నేహితులందరం కలిసి పేద విద్యార్థుల చదువుల కోసం తమ వంతు సాయం అందించాలనే భావనతో ఈ స్వచ్ఛంద సంస్థకు బీజం వేశామని చెప్పారు. పేద విద్యార్థుల ముఖంలో చిరునవ్వు చూడాలనే ఆశతో సంస్థ ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, గౌతమ్ స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు, సంస్థ ప్రతినిధులు నొచ్చర్ల పవన్‌కళ్యాణ్, సూర్యప్రకాష్, దుర్గ కిశోర్, తులసీ, ఆర్. మాధవ, షేక్.కరీం పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నెల్లూరుకు చెందిన శ్రీసాయి లలిత నృత్య నికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచారిణి కె. శిరీషలత ఆధ్వర్యంలో 20 మందికి పైగా చిన్నారులు పలు భక్తి కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. పంచహారతుల సేవ అనంతరం అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. కళాకారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందచేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడ కల్చరల్: అయాచితుల కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఐదవ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జీవీఆర్ ఘంటసాల కళాశాలలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా నాట్యాచారిణి నవ్యశ్రీ బృందంలోని చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. రాజా గురుభవానీ బృందం ఇంద్రకీలాద్రి మీద కొలువైవున్న లోకమాత కనకదుర్గమ్మపై భక్తిగీతాలను ఆలపించారు. విజయవాడ సాంస్కృతిక సమితి వారు ఎరమింగిన చేప, సాగర్ ఆర్ట్స్ వారు కాలజ్ఞానం నాటికలను ప్రదర్శించారు. అయాచితుల కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అయాచితుల రామకృష్ణ మాట్లాడుతూ సంస్థ సాంస్కృతి కళారూపాల ప్రదర్శనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. నాటక రచయిత దర్శకుడు కత్తి శ్యాంప్రసాద్, రంగస్థల నటుడు పట్నాయక్, వివిధ రంగాలకు చెందిన నీలం దుర్గారావు, జీ బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తెలంగాణ రాష్ట్రం కొడవటంచ గ్రామానికి చెందిన వెంగల శ్రీనివాస్, మమత దంపతులు రూ.10,016, హైదరాబాద్‌లోని మూసాపేట ప్రాంతానికి చెందిన గట్టు భూమిక నైనశ్రీ రూ.5,000 విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ డైరెక్టర బెజవాడ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆలయ సిబ్బందికి అందజేశారు.

నెహ్రూ లాంటి నేత చాలా అరుదు

- న్యాయం కోసం రాజకీయాలు చేశారు
- ప్రతి పేదవాడి గుండె చప్పుడుగా అవినాష్
- దేవినేని నెహ్రూ 71వ జయంతిలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్ కుమార్
- నగరంలోని పలు ప్రాంతాల్లో జయంతి కార్యక్రమాలు



నెహ్రూ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నాగార్జున, కైలే, అవినాష్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజకీయాల్లో దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) లాంటి నేతలు అరుదుగా ఉంటారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. న్యాయం కోసం రాజకీయాలు చేసిన వ్యక్తి నెహ్రూ అన్నారు. మాజీ మంత్రి దేవినేని నెహ్రు 71వ జయంతి సందర్భంగా గుణదలలోని నెహ్రూ ఘాట్, ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్, నెహ్రూ తనయుడు దేవినేని అవినాష్, ఇతర నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ తండ్రి నెహ్రూ చూపిన మార్గంలో తనయుడు దేవినేని అవినాష్ పయనిస్తున్నాడని చెప్పారు. ఎక్కడ సమస్య ఉంటే అవినాష్ అక్కడ ఉంటాడన్నారు. ప్రతి పేదవాడి గుండె చప్పుడుగా పని చేస్తున్నారని కొనియాడారు. కేసులు కూడా లెక్కచేయకుండా వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తున్నాడని పేర్కొన్నారు. అవినాష్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ మరింత బలంగా మారుతుందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో నెహ్రూ లాంటి నాయకుడు మరొకరు లేరని మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ అన్నారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా ఉన్నారని ఆయన దగ్గరకు వెళితే ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని ప్రజలు నమ్మేవారన్నారు. నెహ్రూ బాటలోనే అవినాష్ కూడా ప్రజల కోసం కష్టపడి పనిచేస్తున్నాడని చెప్పారు. దేవినేని అవినాష్‌కు వైఎస్ జగన్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నెహ్రూకు రాజకీయ జన్మ ఎన్టీఆర్ ఇస్తే, పునర్జన్మ వైఎస్సార్ ఇచ్చారన్నారు. జిల్లాలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతో తూర్పు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రజల కల నెరవేర్చినట్లు తెలిపారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటూ పథకాలు అమలు చేశామన్నారు. మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చేగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు, ఇతన నేతలు, నెహ్రూ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలయేసు పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి పాప ప్రక్షాళన కోసం దేవాదిదేవుడు యేసు శిలువపై మరణిస్తూ తన రక్తాన్ని ధారపోశారని అద్భుత బాల యేసు పుణ్యక్షేత్రం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప తెలిపారు. పవిత్ర క్రీస్తు శరీర రక్త పండుగ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో ఆదివారం జోజినగర్ బాల యేసు చర్చి నుంచి ఊరేగింపు నిర్వహించారు. చర్చి సెంటర్ నుంచి దివ్య సత్రసాదం, శిలువ, క్యాండిల్స్‌తో ఊరేగింపుగా బయలుదేరి బైపాస్ రోడ్ మీదుగా జోజినగర్ పురవీధులగుండా దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఏసు శిక్షింపబడుతూ శిలువనెక్కిన సమయంలో చిందించిన అమూల్యమైన రక్తం నిష్కలంకమైనదని కొనియాడారు. యేసయ్య రక్తం మానవుల పాపాలను కడిగివేస్తుందని తెలిపారు. శిలువపై ఉన్న ఆయన శరీరం నుంచి నేలపై చిందిన ప్రతి రక్తపు బొట్టు ప్రజల ఘోర పాపాల నుంచి విముక్తి కలిగిస్తుందని పేర్కొన్నారు. ఊరేగింపు కార్యక్రమంలో విచారణ సహాయ గురువులు నీలం లూర్దు రాజు, కౌన్సిల్ మెంబర్స్, విన్సెంట్ పాల్ సొసైటీ సభ్యులు, ఉపదేశస్తులు, సంఘస్తులు, యువతీ యువకులు పాల్గొన్నారు.



ఊరేగింపులో దివ్య సప్రసాదంతో ఫాదర్ చిన్నప్ప



బైపాస్ రోడ్‌లో ఊరేగింపులో పాల్గొన్న సంఘస్తులు

పేద మహిళలకు చీరలు పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేవినేని నెహ్రూ 71వ జయంతిని పురస్కరించుకుని చిట్టినగర్‌లో పేద మహిళలకు చీరలు , యువకులకు టీషర్టులు పంపిణీ చేశారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి దేవస్థాన కళ్యాణ మండపంలో పోతిన రాము మిత్ర మండలి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.ఆసీఫ్, పోతిన మహేష్ విచ్చేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయితా కిషోర్, నాయకులు కడియాల బుచ్చిబాబు, వెంకట సత్యనారాయణతో పాటు పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, పలు డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలో నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాహితీ విలువలను చాటిన సంగీత రూపకం



పల్లకీ సేవా ప్రబంధం కావ్యాన్ని యక్షగాన రూపంలో అందిస్తున్న యువ సంగీత కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విష్ణు సేవా ప్రబంధం గేయ సంగీత, సాహిత్య రూపకం సాహితీ విలువలను చాటింది. తంజావూరును పాలించిన మరాఠీ మహారాజు షహాజీ భోంస్లే రచించిన విష్ణుమాయా ప్రబంధ గేయ సంగీత యక్షగానాన్ని సంగీత విద్వాంసుడు గౌరీనాథ్ పర్యవేక్షణలో నిర్వహించారు. విష్ణుమూర్తి వియోగం భరించలేని లక్ష్మీదేవి తన చెలికత్తెలను వైకుంఠం పంపడం.. అక్కడ శ్రీమహావిష్ణువు సమస్త దేవతలతో కొలువై ఉండటం, విష్ణును చేరుకోలేని చెలికత్తెలు నారద మహాముని సాయం కోరడం.. వారు నిరాకరించడం, చివరకు చెలికత్తెలు శ్రీమహావిష్ణువుకు లక్ష్మీదేవి మానసిక వేదనను తెలియజేయడం ఆయన పల్లకీలో లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లడం అంశంగా సంగీత రూపకం సాగింది. గాత్రం లక్ష్మీప్రసన్న, రాజ్యలక్ష్మి అయ్యర్, శ్రీనిధి పాలపర్తి, వైదేహీ పూజ్యం, సాయి శ్రేయ, శ్రీనిధి వాద్య సహకారం అందించారు. వయోలిన్‌పై కోలం సాయికుమార్, వీణ రాయప్రోలు సుధాకర్, వేణువు శేషం రమణ, ఘటంపై డాక్టర్ శ్రీకాంత్, రామానుజపురం సహకరించారు. కార్యక్రమాలను శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ ప్రారంభించారు. శ్రీసద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ యక్షగాన రూపాన్ని నేటి తరానికి అందించాలనే సంకల్పంతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్లకీ సేవా ప్రబంధంలోని సాహిత్య విశేషాలను డాక్టర్ గుమ్మా సాంబశివరావు వివరించారు. వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి శ్రీసద్గురు సంగీత సభ నిర్వాహకుల కృషిని అభినందించారు.

యువతను సన్మార్గంలో నడిపించేదే భగవద్గీత

త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహరాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను క్రమశిక్షణతో కూడిన సన్మార్గంలో నడిపించేది భగవద్గీత అని మంగళగిరి శ్రీచైతన్య మహాప్రభు పాద పీఠ మందిరం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహారాజ్ స్వామీజీ తెలిపారు. భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని వీఎంసీ కల్యాణమండపంలో నిర్వహించిన శ్రీభగవద్గీత ప్రగతి పథం 8వ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్శిని భగవద్గీత అని పేర్కొన్నారు. భగవద్గీతను చదివే చిన్నారులు చురుకుదనం, మంచి నడవడిక కలిగి ఉంటారని తెలిపారు. చిన్నారులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించటం శుభపరిణామమని తెలిపారు. శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సునీతా మధుసూదన్ దంపతులు నిర్వహించిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ జగదీష్, వ్యాపారవేత్త సంబూరు జనార్ధన్, మాధవి దంపతులు, మాజేటి సూర్య వేణుగోపాల్ శ్రేష్ఠి, మంగళగిరి ఫణిధర్ సుజాత, లక్ష్మీప్రసన్న, రమేష్, జగదీష్, మోహన్, సునీత, భగవాన్ పాల్గొన్నారు.



అనుగ్రహభాషణ చేస్తున్న త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహరాజ్ స్వామి



సంప్రదాయ దుస్తుల్లో భగవద్గీత శ్లోకాల పఠనం చేస్తున్న విద్యార్థులు

బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన దొడ్డ రాజశేఖరరెడ్డి, మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన షేక్ బడే మియా ఆదివారం సాయంత్రం ఆంజనేయరెడ్డిని భవానీపురం గాంధి బొమ్మ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిద్దరిని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా లభిస్తున్న విశేష ప్రజాదరణ చూసి ఓర్వలేని కూటమి ప్రభుత్వం పార్టీ నేతలు, నాయకులపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేయటాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసరి కృష్ణారెడ్డి, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొని దొడ్డ రాజశేఖరరెడ్డి, బడేమియాలను అభినందించారు.



రాజశేఖరరెడ్డి, బడేమియాలను సత్కరించిన ఆంజనేయరెడ్డి

యువతకు వెన్నుపోటు పొడిచిన కూటమి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతకు అనేక వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని అమలు చేయకుండా వారికి వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న తలపెట్టిన యువత పోరును విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో వెలంపల్లి శ్రీనివాసరావు యువజన విభాగ నేతలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం తెలుపుతూ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇచ్చిన హామీలను అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు భృతి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 23వ తేదీన ధర్నా చౌక్ నందు వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నిరుద్యోగులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి కలెక్టర్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ విజయవాడ పశ్చిమ శ్రేణులు, నిరుద్యోగులు, ప్రజలందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ పశ్చిమ యువజన విభాగ అధ్యక్షుడు కేసరి రాజశేఖర్ రెడ్డి, పలు అనుబంధ విభాగ నాయకులు బొందిలి నరేంద్ర సింగ్, అబ్దుల్ ఘని చిచ్చా, దొడ్డా రాజశేఖర్ రెడ్డి, మెట్టు వెంకట్ రెడ్డి, అబ్దుల్ అజీజ్, షేక్ ఇర్ఫాన్, గంపల నవీన్, దేవిరెడ్డి కరుణాకర్ రెడ్డి, కామళ్ల జోజి, దిద్దుకూరి శివ యువజన విభాగ నాయకులు, నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి ఇతర నేతలు

యోగా జీవితంలో భాగం కావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగా మానవ జీవితంలో భాగం కావాలని కూరపాటి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అన్నారు. కూరపాటి హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం యోగాసనాలను నిర్వహించారు. అందులో భాగంగా సూర్యనమస్కారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య విద్యార్థులతో యోగాసనాలు వేయించి సూర్య నమస్కారాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ యోగా భారతదేశంలో ఉద్భవించిన పురాతన, భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసం అన్నారు. యోగా శారీరక ఆరోగ్యంగా, మనసు ప్రశాంతంగా ఉండేలా చేస్తుందన్నారు. పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కొండ ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలి

– సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కమ్యూనిస్టులతోనే నగరాభివృద్ధి సాధ్యమని, నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో కమ్యూనిస్టులు పాలించిన సమయంలో జరిగిన అభివృద్ధే అందుకు నిదర్శనమని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. గుంటి భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన 38, 39 డివిజన్ల పార్టీ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న మూడేళ్లకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు ఈ మహాసభలో చర్చించుకోవడం జరిగిందన్నారు. గతంలో కొండ ప్రాంతవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సీపీఐ తనదైన ముద్ర వేసిందని గుర్తు చేశారు. సీపీఐ 24వ మహాసభను జూలై 7,8,9 తేదీలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలుత నాలుగు స్తంభాల సెంటర్, కామకోటినగర్, కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ, ఎమ్ సాంబశివరావు, పార్టీ సీనియర్ నాయకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కోటేశ్వరరావు తదితరులు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుమారుడు కోపంతో మందలించాడని తల్లి అదృశ్యమైన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలోని నల్లకుంటలో చోటుచేసుకుంది. గొల్లపూడి నల్లకుంటకు చెందిన జంపన అననేయ కోల్డ్ స్టోరేజీలో గుమస్తాగా పనిచేస్తాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి కూర విషయంలో భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో అతని తల్లి జంపన కవిత మధ్యలో వచ్చింది. దీంతో ఆయన కోపంతో తల్లిని మందలించాడు. అప్పటితో గొడవ సద్దుమణిగింది. మరుసటి రోజు 20వ తేదీ ఉదయం 8 గంటల ప్రాంతంలో నిద్ర లేచి చూడగా అననేయ తల్లి కనిపించలేదు. చుట్టుపక్కల వాళ్లను, బంధువులను విచారించగా ఆమె ఆచూకీ లభించలేదు. దీనిపై జంపన అననేయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.